RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 84 | ఫిబ్రవరి 18, 2025 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**


ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ..
నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379

# పెద్దలకు ఒకలా.. పేదలకు ఇంకోలా!




- పన్నుల వసూళ్లలో మున్సిపల్ కార్పొరేషన్ పోకడ..!
- నిరుపేదలపైనే అధికారుల ప్రతాపమా?
- ట్యాక్స్ వసూలుపై ఉన్నత అధికారులు దృష్టి సారించాలి..
- గ్రేటర్ వరంగల్ నగరవాసుల వేడుకోలు




**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) ఉన్నతాధికారులు పన్నుల వసూళ్లలో పేదల పట్ల ఒకలా.. పెద్దల పట్ల మరొకలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిరుపేద సామాన్యుడు రూ.10 వేల ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటే.. ఇంటి మీదకు వెళ్లి నానా హంగామా చేసే ఆఫీసర్లు.. పెద్దల పట్ల ఆ తీరున కనీసంగా వ్యవహరించడం లేదని ఆరోపిస్తున్నారు. పేదలపైనే అధికారులు ప్రతాపం చూపిస్తారా? అని అడుగుతున్నారు. పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరుతున్న కమిషనర్.. వసూళ్లపైన ప్రత్యేక దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు. హనుమకొండ హంటర్ రోడ్‌లో గల మెడికోవర్ ఆస్పత్రి యాజమాన్యం మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను రూ.7 లక్షలా 23 వేలా 289 చెక్‌ను ఆదివారం కమిషనర్‌కు అందజేశారు. కాగా, పన్ను ఇంత మొత్తం అయ్యే వరకు అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహించారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. బల్దియా వ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలు, హాస్పిటల్‌లు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, గృహాలు అన్నీ కూడా ఆస్తి పన్నులు విధిగా సకాలంలో చెల్లించి నగర ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్న అధికారులు.. వసూళ్లలో ఎందుకు పురోగతి సాధించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆస్తి పన్ను రూ.లక్షల్లో చెల్లించాల్సి ఉన్నా ఇంత వరకు సదరు ఆస్పత్రులతో పాటు ఇతర సంస్థలపైన ఎందుకు వసూలు చేయలేకపోయారు? అని అడుగుతున్నారు. కేవలం రూ.వేలల్లో ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటేనే.. సామాన్యుల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తారనే అపవాదు మూటగట్టుకున్న అధికారులు.. మరి పెద్ద సంస్థల పట్ల ఎందుకు కనికరం చూపిస్తారని ప్రశ్నిస్తున్నారు. బహుశా.. ఆయా సంస్థల వెనక అండదండలుగా పెద్ద వ్యక్తులున్నారా? వారి ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారా..? లేక వారికి మామూలుగా ఏమైనా ముడుపులు ముడుతున్నాయనే గుసగుసలు వినబడుతున్నాయి.

నగర అభివృద్ధికి కీలకమైన ట్యాక్స్ వసూలు చేయడంలో ఆఫీసర్లు ఉదాసీనంగా వ్యవహరించడమైతే చర్చనీయాంశమవుతోంది. ఇందులో మతలబేంటి? అనే డిస్కషన్ అయితే నడుస్తోంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్, మేయర్.. బడా మొండి బకాయిలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ప్రజలు అభ్యర్థిస్తున్నారు. ట్యాక్స్ వసూలుతో నగర అభివృద్ధికి మరింత బలంగా కృషి చేయొచ్చని జనం సూచిస్తున్నారు.



## కొప్పుల గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా..

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**వేద న్యూస్, శాయంపేట:**

కొప్పుల గ్రామంలో మూడు రోజుల నుండి పండుగ వాతావరణంలో శ్రీలక్ష్మీ, భూలక్ష్మీ సమేతసీతలాంబ(బొడ్రాయి) , పోచమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు జరుగుతున్నాయి.సోమవారం విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవంలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు అర్చకులు, గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, కాంగ్రెస్ నేతలు డప్పుచప్పుళ్లు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీలక్ష్మీ, భూలక్ష్మీ సమేత సీతలాంబ (బొడ్రాయి), శ్రీ పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. కొప్పుల గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశం

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**



అర్జీదారుల సమస్యలపై ప్రత్యేక చొరవ చూపి అధికారులు సత్వరమే పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ స్వయంగా దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రీవెన్స్ దరఖాస్తులను పరిషరించడంలో వివిధ శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. నేటి ప్రజావాణి లో మొత్తం 86 దరకాస్తులు రాగా అందులో రెవెన్యూశాఖ కు సంభంధించినవి 33, వ్యయసాయశాఖ 7, డిఆర్డీఓ, జిడబ్ల్యూ ఎంసీ, ఎంజిఎం 5 చొప్పున, సంబంధిత శాఖల నుండి మిగిలిన వినతులు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ విజయలక్ష్మి, డిఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓ లు సత్యపాల్ రెడ్డి,ఉమారాణి, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

- కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే
- భవన నిర్మాణాలకు అనుమతుల జారీ కోసం క్షేత్ర స్థాయి లో పరిశీలన

**వేద న్యూస్, హనుమకొండ**



భవన నిర్మాణ నిబంధనలు పాటిస్తేనే అనుమతులు జారీ చేస్తామని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే స్పష్టం చేశారు. నూతన భవనాల నిర్మాణాలకు అనుమతుల మంజూరు బడా భవన నిర్మాణాలకు ఆక్యుపేన్సి సర్టిఫికెట్‌ల జారీకై సోమవారం కమిషనర్ నగర పరిధిలోని సుబేదారి ప్రాంతంలో గల పోస్టల్ కాలనీ, ప్రకాశ్ రెడ్డిపేట లోటస్ కాలనీ ఖాజీపేట ప్రాంతంలో క్షేత్ర స్థాయి లో పర్యటించి నమోదు చేసిన వివరాలను కొలతలు వేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టిఎస్-బీపాస్ ద్వారా భవన నిర్మాణాల అనుమతులకోసం దరఖాస్తు చేసిన నేపథ్యంలో సూచించిన ధృవ పత్రాలు నమోదు చేసి నిబంధనలు పాటిస్తే చట్టంకు లోబడి అనుమతులు మంజూరు చేస్తామని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారికి అనుమతులు ఇవ్వడం జరగదని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీందర్, రాదేకర్ ఏసిపిలు యెర్షాద్, రజిత తదితరులు పాల్గొన్నారు.




## ఆరెలకు ఓబీసీ సాధనకు కృషి చేయండి

- ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకన్న

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ సాధనకు ఆరె సంక్షేమ సంఘ నేతలు కృషి చేయాలని, ఢిల్లీలోని మకాం వేసి సర్టిఫికెట్ సాధించిన తర్వాతే తెలంగాణకు రావాలని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్న అన్నారు. ఆయన ఎల్కతుర్తి మండల పరిధిలోని దామెర గ్రామంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణకు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణకు శ్రమించిన దామెర గ్రామ విగ్రహ కమిటీ, ఆరె సంక్షేమ సంఘ కమిటీని ప్రత్యేకంగా అభినందించారు. ఆరె కులస్తులతో పాటు అందరికీ ఆరాధ్యుడైన శివాజీ మహరాజ్ స్ఫూర్తిని అందరూ తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఆరె కులస్తులకు సూచించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అద్భుతమైన



4లో..

## మెట్టుగుట్ట మహాశివరాత్రి గోడ పత్రిక ఆవిష్కరణ

## ఎరువుల కోసం రైతులెవరు ఆందోళన చెందొద్దు

**- అధికారులతో మాట్లాడి యూరియా తెప్పిస్తున్నా**

**- పెగడపల్లి పిఎసిఎస్ చైర్మన్ ఓరుగంటి రమణారావు**

పెగడపల్లి : జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి పిఎసిఎస్ పరిధి రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందొద్దని, అధికారులతో మాట్లాడి యూరియా కోటాను తెప్పిస్తున్నానని పెగడపల్లి పిఎసిఎస్ చైర్మన్ ఓరుగంటి రమణారావు శనివారం తెలిపారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో గల పిఎసిఎస్ ఎరువుల గోదాంను చైర్మన్ రమణారావు శనివారం పరిశీలించి, రైతులతో యూరియా కొరత గురించి వివరించారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చిలుముల రాంచందర్ తో మాట్లాడి యూరియా కొరతను తీర్చాలని చైర్మన్ రమణారావు కోరుతూ వెంటనే నలభై టన్నుల యూరియాను పెగడపల్లి పిఎసిఎస్ కు పంపాలని కోరారు. వెంటనే స్పందించిన వ్యవసాయ శాఖ అధికారి యూరియాను పంపిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పెగడపల్లి పిఎసిఎస్ చైర్మన్ ఓరుగంటి రమణారావు మాట్లాడుతూ రైతులు అవసరం మేరకే యూరియాను తీసుకెళ్లాలని, అనవసరంగా తీసుకెళ్లి యూరియా కొరత సృష్టించొద్దని సూచించారు. ఈ రబీ సీజన్లో 600 టన్నుల యూరియా కోటా మంజూరు ఉండగా, 320 టన్నుల యూరియాను మాత్రమే పెగడపల్లి పిఎసిఎస్ కు అధికారులు పంపారని, వచ్చిన యూరియాను రైతులకు పంపిణీ చేశామని, మిగిలిన యూరియా కోసం అధికారులను ఒప్పించి తెప్పిస్తున్నామని, ఎప్పుడు యూరియా వస్తే అప్పుడు వెంటనే రైతులకు పంపిణీ చేస్తున్నామని ఈ సందర్భంగా రమణారావు తెలిపారు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్

సిద్దిపేట : గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాల విషయం లో ఎటువంటి రాజి పడకుండా కొత్త డైట్ మెనూ ప్రకారం భోజన వసతి అందించాలనిజిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి తెలిపారు. గజ్వెల్ ప్రజ్ఞపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాతూరు లోగల మహత్మ జ్యోతి భాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతులు సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ గురుకులం లో 484మంది బాలికలు విద్యను అభ్యశిస్తున్నట్లు, గురుకులానికి కావలసిన సౌకర్యాల గూర్చి అడగ్గా ఇడ్లి పాత్రలు, కొన్ని బాగోన్లు కావాలని, డార్మెటరీ లో విండోస్ డోర్స్ రిపేర్ ఉన్నాయని సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. అన్ని సౌకర్యాలు అందిస్తానని హామీ ఇచ్చారు. డార్మెటరీ గది, వంటగది, స్టోర్ రూమ్ లను పరిశీలించారు. వంట చేసే సిబ్బందితో మాట్లాడారు. కొత్త డైట్ మెనూ అయితే తప్పనిసరిగా పాటించాలని సామాగ్రి దొరకలేదని సాకులు చెప్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. స్టోర్ రూమ్ లో కాలం చెల్లిన వస్తువులు వాడకూడదనీ సూచించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ బై పి సి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ప్రతి సబ్జెక్ట్ పైన గ్రిప్ ఉండాలని ఇష్టంతో చదవాలని తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్ తరచూ మాట్లాడుతుంటే వస్తాయని, అతి త్వరలో బోర్డ్ ఎగ్జామ్స్ ఉన్నందున బాగా ప్రిపేర్ మరియు రివిషన్ చెయ్యాలని సమయం వృధా చెయ్యవద్దని అల్ ది బెస్ట్ తెలిపారు. కలెక్టర్ వెంట గజ్వెల్ తహసీల్దార్, ఎంపిడివో గురుకుల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ముగ్గురు దొంగల అరెస్టు..బంగారం స్వాధీనం

హైదరాబాద్ : లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 15వ తేదీ జరిగిన దొంగతనం కేసును లంగర్ హౌస్ పోలీసులు ఛేదించారు. సుమారు 9:30 తులాల బంగారాన్ని దొంగలించినట్లు ఫిర్యాదుదారుడు లంగర్ హౌస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందులో భాగంగా నాలుగు గ్రూపులు వాడిన పోలీసులు విచారణ చేపట్టి సుమారు 100 కెమెరాలను పరిశీలించి ముగ్గురు నిందితులను ఈరోజు అదుపులోకి తీసుకొని న్యాయనిమితం కోర్టుకు తరలించారు. ఈ ముగ్గురు నేరస్తుల పై పలు పోలీస్ స్టేషన్లలో దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. వీరి వద్ద నుండి 12 తులాల బంగారంతో పాటు మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు దొంగలించిన బంగారాన్ని అమ్ముకొని జల్సాలకు అలవాటు పడ్డారని సౌత్ వెస్ట్ జోన్ డిసిపి చంద్రమోహన్ తెలిపారు.

## విద్యుత్ ఆర్టిజన్లను శాశ్వత ఉద్యోగులుగా తీసుకోవాలి

హైదరాబాద్:విద్యుత్తుశాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లుగా గుర్తించాలని శాశ్వత ఉద్యోగులుగా పరిగణనలోకి తీసుకోవాలని తెలంగాణా స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ 1535 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ కోరారు. ఎన్నో ఏళ్ళుగా అతి తక్కువ జీతాలకు పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు, హౌస్ కీపింగ్ వర్కర్లను పట్టించుకునేనాథుడే లేడన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2వేల మంది స్వీపర్స్, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులు ఉన్నారన్నారు. ఈ నెల 20న చలో విద్యుత్ సౌదా కార్యక్రమం విజయవంతం చేసేందుకు జీటీఎస్ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఐటీఐ చేసిన ఆర్టిజన్లకు జె. ఎల్.ఎం. జె.పి.ఎ ఇవ్వాలని, డిగ్రీ, పీజీ విద్యా అర్హత ఉన్నవారికి జూనియర్ అసిస్టెంట్స్, డిప్లమా చేసిన వారికి సబ్ ఇంజినీర్స్, పదోతరగతి, ఇంటర్ చదువుకున్న వారికి ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

## సీఎం రేవంత్ రెడ్డి ఒక మూర్ఖుడు


**- మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి హాట్ కామెంట్స్**

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేదంటే రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీలో కెసిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లా నాగయ్య ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు పోటీలకు జగదీశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తోటి నాయకుల ను గౌరవించాలి అనే చోటు లేని ఒక మూర్ఖుడు తెలంగాణ రాష్ట్రానికి సీఎంగా ఉన్నాడని మండిపడ్డారు. సంవత్సర కాలంలోనే ప్రభుత్వాన్ని నడిపించలేని స్థితికి వచ్చి బొక్క బోర్ల పడ్డాడని అన్నారు. కేసీఆర్ ముందు బొక్క బోర్లా పడి కేసీఆర్ కాళ్ళ పట్టుకునే పరిస్థితిలో ఉన్నాడని అన్నారు. రేవంత్ రెడ్డికి అన్ని మార్గాలు మూసుకుపోయాయని సొంత పార్టీలోనే రేవంత్‌రెడ్డి పై నేతలు తిరిగి పడుతున్నార న్నారు. సొంత పార్టీ నేతలే రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయికి దిగజారి పోయాడని ఆరోపించారు. ఆరు నెలలుగా కాంగ్రెస్ పార్టీ అధినాయకుడైన రాహుల్ గాంధీ అపాయింట్మెంట్‌కూడా రేవంత్‌రెడ్డికి దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉన్న కాలం అంతా దోచుకోవడానికి, దాచుకోవడానికి, సొంతవారికి కట్టబెట్టడానికి సమయం సరిపోతుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగయ్యే రోజులు దగ్గరకు వచ్చాయన్నారు.

## కుంభమేళలో చార్జింగ్‌తో లక్షల ఆదాయం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభ మేళా జరుగుతున్న విషయం తెలిసిందే. 144 ఏళ్లకు ఒకసారి జరిగే మహా కుంభ మేళాకు భక్తులు కోట్ల సంఖ్యలో పోటెత్తుతున్నారు. కుంభ మేళాలో పాల్గొని పవిత్రమైన త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ఇంకా చాలా మంది భక్తులు దేశ నలుమూలల నుంచి, అలాగే విదేశాల నుంచి కూడా కోట్ల మంది కుంభ మేళాలో పాల్గొనేందుకు ప్రయాగ్ రాజ్‌కు పయనమవుతున్నారు. కుంభ మేళాకు ఇంత పెద్ద ఎత్తున భక్తులు వస్తుండటంతో చాలా మంది చిరు ఉద్యోగులకు మంచి ఆదాయం కూడా సమకూరుతుంది. అంతమందికి అవసరమైన భోజనం, ఇతర చిన్న చిన్న అవసరాలను తీరుస్తూ, సౌకర్యాలను ఏర్పాటు చేస్తూ కొన్ని వందల మంది మంచి ఆదాయం అందుకుంటున్నారు. ఇప్పటికే ప్రయాగ్ రాజ్ చుట్టుపక్కల వాళ్లు కుంభ్ నగర్‌లో ఏదో ఒక చిన్న వ్యాపారం పెట్టుకున్నారు.అయితే ఓ కుర్రాడు మాత్రం చాలా డిఫెరెంట్‌గా ఆలోచించి.. ఫోన్ ఛార్జింగ్ బిజినెస్ పెట్టాడు. ఈ కాలంలో ఫోన్ లేని వాళ్లు ఎవరున్నారు చెప్పండి. అయితే ఎక్కడెక్కడి నుంచో వచ్చిన చాలా మంది భక్తులు ఫోన్‌లో ఛార్జింగ్ కోసం ఈ కుర్రాడి చుట్టూ గుమ్మిగూడుతున్నారు. ఒక్క ఫోన్‌కు గంట సేపు ఛార్జింగ్ పెట్టినందుకు రూ.50 తీసుకుంటున్నాడు. అలా ఓకేసారి ఓ 25 ఫోన్లకు ఛార్జింగ్ పెట్టేలా సాకెట్‌లు ఏర్పాటు చేసుకున్నాడు.

# నోటాపై రానీ ఏకాభిప్రాయం




హైదరాబాద్ : రానున్న పంచాయతీ ఎన్నిక ల్లో నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే మళ్లీ ఎన్నికలకు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతిపాదించింది. నోటా కన్నా తక్కువ ఓట్లు వచ్చిన వారు రెండోసారి ఎన్నికల్లో పోటీ చేకుండా నిబంధన తీసుకురావాలని భావిస్తోంది, ఒకే నామినేషన్ వేస్తే ఏకగ్రీవ ఎన్నిక ప్రకటించకుండా నోటాను అభ్యర్థిగా పరిగణించి ఓటింగ్ పెట్టాలని యోచిస్తోంది. ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం జరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతి పాదనలపై రాజకీయ పార్టీలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదనను కాంగ్రెస్ పార్టీ తిరస్కరించింది. మళ్లీ ఎన్నికలు నిర్వహించడం చాలా ఖర్చుతో కూడిన వ్యవహారమని పేర్కొన్నది. ఒకే నామినేషన్ వచ్చిన చోట ఏకగ్రీవంగా ఎన్నిక ప్రకటించకుండా నోటాను అభ్యర్థిగా పేర్కొంటూ ఎన్నిక నిర్వహించాలన్న ప్రతిపాదనను బీఆర్ఎస్ సమర్థించింది. ఏకగ్రీవ ఎన్నికల అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున అభిప్రాయం చెప్పలేమని బీజేపీ వెల్లడించింది. ఎన్నికల్లో నోటాకు సంబంధించిన నిర్ణయాలు రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలోకి రాదని, దానికి అవసరమైన చట్టసవరణలు చేయాల్సి ఉంటుందని బీజేపీ నేతలు పేర్కొన్నారు. నోటా ఉండాలని, కానీ నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే మళ్లీ ఎన్నిక నిర్వహించడం సరికాదని సీపీఎం పార్టీ అభిప్రాయపడిందిఒకే అభ్యర్థి ఉన్న గ్రామా ల్లోనూ నోటా పెట్టి పోలింగ్ నిర్వహించాలని జనసేన పార్టీ సూచించింది. ఇక రెండు రోజుల్లో తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని టీడీపీ తెలిపింది. రాజకీయ పార్టీల నేతల సూచనలను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ఎన్నికల సంఘం.. న్యాయ నిపుణుల సూచనలు కూడా స్వీకరించనుంది. ఇదిలా ఉండగా, పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చలేదన్న అభిప్రాయాన్ని తెలిపే స్వేచ్ఛ ఉండాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటాను ప్రవేశపెడుతూ 2016, 2018, 2019లో రాష్ట్రంలో నిబంధనలు సవరించారు. అయితే ఒకవేళ నోటాకే ఎక్కువ ఓట్లు వచ్చినప్పటికి ఆ తర్వాత స్థానంలో ఉన్న వ్యక్తి ఎన్నికైనట్లు ప్రకటించాలని ప్రస్తుతం నిబంధన ఉన్నది.

ఒకే నామినేషన్ వచ్చినట్లయితే ఏకగ్రీవంగా ప్రకటిస్తున్నారు. అయితే ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు కొన్ని చోట్ల బలప్రయోగాలు, జరుగుతున్నాయని నోటాతో ఎన్నికలు పెట్టాలని పలు ఎన్జీవోలు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరాయి. ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలపై అధ్యయనం చేసిన ఈసీ మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా విధానాలను పరిశీలించింది. ఈ రాష్ట్రాల్లో.. పోటీలో ఉన్న అభ్యర్థుల కన్నా నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలనే నిబంధన అమల్లో ఉంది. రెండోసారి కూడా నోటాకే ఎక్కువ ఓట్లు వస్తే మాత్రం మళ్లీ ఎన్నిక నిర్వహింకుండా రెండో స్థానం ఉన్న అభ్యర్థిని ఎన్నికైనట్లు ప్రకటించేలా నిబంధనలున్నాయిహర్యానాలో మాత్రం నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే మళ్లీ ఎన్నిక నిర్వహించడంతో పాటు మొదటిసారి పోటీలో ఉన్నవారు తిరిగి పోటీ చేయరాదనే రూల్ ఉంది.

## కాంగ్రెస్ వైఫల్యాల కారణంగానే నీటి ఎద్దడి

హైదరాబాద్ : తెలంగాణలో ఏడాది పాలనలో కాంగ్రెస్ వైఫల్యంతో నీటి సంక్షోభం దిశగా రాష్ట్రం వెళ్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ వ్యాప్తంగా భూగర్భజలాల గణనీయంగా తగ్గడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. తెలంగాణను భూగర్భజల సంరక్షణలో ఆదర్శంగా నిలిపిన గత బీఆర్ఎస్ ప్రభుత్వ నీటి ప్రణాళికలు కాంగ్రెస్ పాలనలో పూర్తిగా వైఫల్యానికి గురవుతున్నాయని విమర్శించారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో 2014 నుంచి 2023 వరకు భూగర్భజలాలు 56 శాతం పెరిగాయి. మిషన్ కాకతీయ ద్వారా 27,000కు పైగాచెరువులను పునరుద్ధరించాం. దాంతో ఏకంగా 15 లక్షల ఎకరాలకు సాగునీరు అందింది. మరోవైపు 8.93 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. రైతులకు సాగు కోసం భూగర్భజలాల నిల్వ స్థిరంగా ఉండి, తాగునీటి భద్రత సైతం పెరిగింది. అన్నదాతలకు పంటల సాగుకు సౌకర్యాలు అదే స్థాయిలో పెరిగాయి. కానీ, కేవలం 14 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో బీఆర్ఎస్ తెచ్చిన ఈ వ్యవస్థ అస్తవ్యస్తం అవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలాల గణనీయంగా తగ్గడం నిజంగా ఆందోళనకరం. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో రెండు మీటర్లకు పైగా భూగర్భజలాలు పడిపోయాయి. యాదాద్రి భువనగిరిలో 2.71 మీటర్ల భారీ తగ్గుదల నమోదైంది. మరోవైపు రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఇతర జిల్లాల్లోనూ భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలాల తగ్గుతున్నాయి. 120 కిలోమీటర్ల పొడవున గోదావరి పూర్తిగా నీరులేకుండా ఎండిపోతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ వైఫల్యం వల్ల గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోయింది. మేడిగడ్డ సహా ప్రాజెక్టు నీటి భద్రతను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని' హరీష్ రావు ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు తాగునీటిని అందించిన మిషన్ భగీరథ రేవంత్ రెడ్డి పాలనతో పూర్తిగా కుంటుపడింది. తెలంగాణ ప్రజలు మళ్లీ బోర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి తలెత్తింది. తాగునీటి కోసం ఎక్కువ మోటార్లు నడపాల్సి రావడం వల్ల కరెంట్ బిల్లులు పెరిగి ప్రజల జేబుకు చిల్లు పడి వారిపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. కాంగ్రెస్ 14 నెలల పాలన తెలంగాణను నీటి సంక్షోభం వైపు నెట్టిందని,బలమైన నీటిపారుదల వ్యవస్థను తన నిర్లక్ష్యంతో కాంగ్రెస్ పతనం చేస్తోందన్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటి పరిరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఎత్తులు.. పై ఎత్తులు

**- పొలిటికల్ హీట్ పెంచుతున్న కామెంట్స్**

హైదరాబాద్ : తెలంగాణ పాలిటిక్స్ మాత్రం ప్రతీరోజు క్లైమాక్స్‌ను తలపిస్తున్నాయి. రేపోమాపో ఎన్నికలు ఉన్నాయన్నట్లుగా ఎత్తుకు పైఎత్తులు వేస్తూ పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నాయి పార్టీలు. బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తామని కాంగ్రెస్ నేతలు సవాల్ చేస్తున్నారు. గులాబీ నేతలు అయితే రేవంత్ సీటుకే ఎసరు వచ్చిందని.. బీఆర్ఎస్ఎల్పీ విలీనం అయ్యే పని కాదని కౌంటర్ ఇస్తున్నారు. దీంతో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లుగా కొనసాగుతోన్న రాజకీయం ఆసక్తికరంగా మారింది. ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అధికార పార్టీలోకి జంప్ అయినప్పటి నుంచి..లేటెస్ట్‌గా కాంగ్రెస్ ఎమ్మెల్యేల రహస్య సమావేశం వరకు పాలిటిక్స్ ఇంట్రెస్టింగ్‌గా కొనసాగుతున్నాయి. కారు పార్టీ నుంచి హస్తం పార్టీలో చేరిన పది ఎమ్మెల్యేల ఫిరాయింపుపై సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఉంటుందోనన్న ఉత్కంఠ ఉండనే ఉంది. ఇలాంటి సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పొలిటికల్ ఫైట్ రోజుకో టర్న్ తీసుకుంటోంది. అధికార పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ ఆసక్తికర కామెంట్స్ చేస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల రహస్య మీటింగ్ ఏర్పాటు చేసుకున్నప్పటి నుంచి హస్తం పార్టీ వ్యవహారాలను నిశితంగా పరిశీలిస్తోందట కారు పార్టీ. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీలోని కొంత మంది ఎమ్మెల్యేలు అసంతృప్తితో రగిలిపోతున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని గద్దె దించేందుకు ప్లాన్ జరుగుతోందని..ఇందుకోసం 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కుంపటి పెట్టారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది కాంగ్రెస్ సర్కార్ కూలిపోయేందుకు ఒక ఇండికేషన్ అంటున్నారు. ఎర్రబెల్లి వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యేల రహస్య భేటీకి, రేవంత్‌ను దించేందుకు 25 మంది ఎమ్మెల్యేలు ఒక్కటయ్యారని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నదానికి ఎక్కడో లింక్ ఉందన్న టాక్ వినిపిస్తోంది. అధికార కాంగ్రెస్‌లో ఏదో జరగబోతోందని చెప్తుండగా..హస్తం పార్టీ మాత్రం రివర్స్ గేర్ వేస్తోంది. బీఆర్ఎస్ నుంచి మరికొంత మంది ఎమ్మెల్యేలను చేర్చుకునేందుకు వ్యూహాలను స్పీడప్ చేసిందట. ఢిల్లీ స్థాయిలో సీరియస్‌గా సంప్రదింపులు జరుపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఫిరాయింపులపై న్యాయ పరమైన చిక్కులు రాకుండా ఏకంగా బీఆర్ఎస్ఎల్పీనే కాంగ్రెస్‌లో విలీనం చేసుకునే ప్లాన్‌తో ముందుకెళ్తోందట హస్తం పార్టీ. బీఆర్ఎస్‌కు చెందిన 38 మంది ఎమ్మెల్యేల్లో ఇప్పటికే 10 మంది శాసనసభ్యులు అధికార కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఫిరాయింపులపై బీఆర్ ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా..కోర్టు సూచనతో అసెంబ్లీ స్పీకర్ జంపింగ్ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. దీంతో ఫిరాయింపుల ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయం ఎలా ఉండబోతుందోనన్న ఆందోళన అధికార కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతోంది. ఇప్పటికే చేరిన 10మంది ఎమ్మెల్యేలకు తోడు మరో 16 మంది ఎమ్మెల్యేలను చేర్చుకోవాలని ప్లాన్ చేస్తోం దట కాంగ్రెస్. బీఆర్ఎస్ఎల్పీ విలీనం కావాలంటే 2/3 మెజారిటీ అవసరం. అంటే ఇంకో 16 ఎమ్మెల్యేలకు ఎర వేసి.. బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోందట. అట్లైతే న్యాయపరంగా ఎక్కడా చిక్కులు రావని కాంగ్రెస్ ప్లాన్‌గా తెలుస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా వెనకాడిన గులాబీ పార్టీ..స్థానిక సంస్థల ఎన్నికల వరకు మరింత దెబ్బతింటుందని, కనీసం పోటీ చేసేందుకు ఆ పార్టీకి అభ్యర్థులు దొరకరన్నది హస్తం పార్టీ అంచనాగా చెబుతున్నారు. గ్రామస్థాయిలో బీఆర్ఎస్ పార్టీని పూర్తిస్థాయిలో వీక్ చేయాలనే స్కెచ్‌తో ఉందట అధికార కాంగ్రెస్ పార్టీ. ఇంతకీ రేవంత్‌కు వ్యతిరేకంగా 25 మంది ఎమ్మెల్యేలు గ్రూపు కడుతున్నారన్నది రియలా..వైరలా.? లేక 16 మంది కారు పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకుని బీఆర్ఎస్ ఎల్పీని విలీనం చేసుకోబోతుందా.? ఇదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయం ఎటా ఉండబోతుందో చూడాలి మరి.




## హాట్ టాపిక్ గా మారిన సోషల్ ఇంజనీరింగ్

హైదరాబాద్ : తెలంగాణలో సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు హాట్ టాపిక్ గా మారాయి. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణ కారణాలుగా చెప్పవచ్చు. తమ వర్గాల జనాభా లెక్కల కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజల కోరిన మేరకు, కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహించింది. ఇటీవల సర్వే గణాంకాలను వెల్లడించింది. ప్రభుత్వ కులగణన లెక్కల ప్రకారం... తెలంగాణలో బీసీలు 56.33%, ఎస్సీలు 17.43%, ఎస్టీలు 10.45%, ఓసీలు 13.31% ఉన్నారు. ఏక సభ్య ఎస్సీ కమిషన్ ప్రకారం... ఎస్సీల్లోని 59 కులాలను మూడు గ్రూపులుగా విభజించి 15% రిజర్వేషన్లు ప్రకటించారు. ఈ సర్వే లెక్కలు తప్పంటూ విపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు కొట్టిపారేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీలకు 27% రిజర్వేషన్లు పోగా...మిగిలిన 23% బీసీలకు కల్పిస్తారని ప్రచారం జరిగింది. అయితే ఈ ఊహాగాలనాలకు తెర దించుతూ బీసీలకు రాజకీయంగా, విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్ల కల్పించేందుకు మార్చి మొదటి వారంలో చట్టం చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంచలన ప్రకటన చేశారు. దీంతో ఈ విషయంలో బీఆర్ఎస్, బీజేపీలకు కాంగ్రెస్ చెక్ పెట్టగలిగిందని విశ్లేషకులు అంటున్నారు. అంతేకాకుండా రాష్ట్రం ఆమోదించిన చట్టాన్ని కేంద్రానికి పంపి 9వ షెడ్యూల్‌లో పొందుపరిచి తమిళనాడు తరహా రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ భావిస్తుంది. అయితే కాంగ్రెస్ కులగణన సర్వేను ప్రతిపక్షాలు టార్గెట్ చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలే కరెక్ట్ అంటూ బీఆర్ఎస్ వాదిస్తోంది. కులగణన సర్వేలో బీసీలను తక్కువగా చూపారంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. బీసీల సంఖ్య గతం కంటే పెరిగిందని కాంగ్రెస్ వాదన. రిజర్వేషన్లపై చట్టం చేయనున్న కాంగ్రెస్ ప్రభుత్వం.... ఈ అంశాన్ని జాతీయ అంశంగా మారుస్తున్నట్టు కనిపిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన చట్టంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందా? తమిళనాడు తరహా రిజర్వేషన్లకై కృషి చేస్తుందా? బీసీ రిజర్వేషన్లపై ఆ పార్టీ వైఖరి ఏంటి? అనేది ఉత్కంఠ రేపుతుంది. చేపట్టిన కులగణన సర్వే కేంద్రంలోని ఎన్డీఏను కలవరపెడుతుందని కాంగ్రెస్ వాదిస్తుంది. కులగణన లెక్కల ప్రకారం ఆయా వర్గాలకు రిజర్వేషన్ల పెంపు, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో వారికి సమూచిత స్థానం కల్పిస్తామని కాంగ్రెస్ అగ్రనేతలు హామీ ఇస్తున్నారు. కులగణనతో దేశం దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తుంది కాంగ్రెస్. తెలంగాణ బాటలో దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా కులగణన చేపట్టి మెజారిటీ వర్గాలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తారన్న చర్చ తెరపైకి వచ్చింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను అస్త్రంగా మార్చుకోవాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది.

## ఇసుక రవాణాపై నిరంతరం నిఘా పెట్టాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**

రాజన్న సిరిసిల్ల : జిల్లాలో ఇసుక రవాణాపై నిరంతరం నిఘా పెట్టాలని ఆర్డీవోలు తహసీల్దార్లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. ఇసుక రవాణాపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అనుమతి ఉన్న ఇసుక రీచ్ ల నుంచి మాత్రమే తరలించాలని, వే బిల్, డ్రైవర్ కు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అనుమతి లేని వాగుల నుంచి ఇసుక తరలించకుండా నిఘా పెట్టాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, ఇతర అవసరాలకు ఇసుక అవసరం ఉంటుందని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కేసులు పెట్టాలని, ఆయా చోట్ల ఇసుక అక్రమంగా తరలించకుండా కందకాలు తవ్వించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల ఇన్చార్జి ఆర్డీవో రాధాభాయ్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఆర్టీవో కార్యాలయం వద్ద లారీ ఓనర్ హంగామా...

పెద్దపల్లి: పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని ఆర్టిఏ కార్యాలయం వద్ద బసంత్‌నగర్‌కు చెందిన లారీ ఓనర్ అనిల్ గౌడ్ హంగామా చేశారు. ఆర్టీవో అధికారులకు డబ్బులు ఇవ్వకుంటే తన వాహనాలపై కేసులు పెట్టారని లారీ ఎక్కి విద్యుత్ తీగలు పట్టుకుంటానని బెదిరిస్తూ ఆందోళనకు దిగాడు. అధికారులకు మామూళ్ళు ఇవ్వనందుకే లారీపై కేసు నమోదు చేసినట్లు ఆరోపించాడు. ఒక్కో లారీకి నెలకు 8000 రూపాయలు లారీ ఓనర్ల వద్ద లంచం వసూలు చేస్తున్నట్టు అనిల్ గౌడ్ తెలిపారు. లారీ ఓనర్ ఆందోళనతో ఆర్టీఏ అధికారులు అతని సముదాయించి కిందికి దింపారు. ఓవర్ లోడ్ తోపాటు సకాలంలో టాక్సీలు చెల్లించకపోవడంతోనే కేసు నమోదు చేసినట్లు ఆర్టీఏ అధికారులు తెలిపారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని ప్రకటించారు.

## 'అందమైన చేతి రాత' పై విద్యార్థులకు టి-సాట్ ప్రత్యేక పాఠాలు

హైదరాబాద్ : అందమైన చేతిరాత కళను విద్యార్థులందరికీ పంచేందుకు టి-సాట్ నెట్వర్క్ ప్రత్యేక పాఠ్యాంశాలను ప్రసారం చేయనుంది. మధ్యాహ్నం 12 నుండి ఒంటి గంట వరకు కాలిగ్రఫీ 'అందమైన చేతి రాత' పై ప్రత్యేక ప్రత్యక్ష కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నట్లు టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులు చేతి రాత సరిగా లేక అనేక ఇబ్బందులు పడటమే కాకుండ, పరీక్షల్లో మార్కులు కోల్పోతున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం అనుభవం కలిగిన హ్యాండ్ రైటింగ్ నిపుణుల చే ప్రత్యేక అవగాహన కార్యక్రమం ప్రసారం చేయనున్నట్టు సీఈవో వేణుగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. జర్మనీ లో విద్యనభ్యసించే ఇంజనీరింగ్ విద్యార్థులనుద్దేశించి ఇప్పటికే జర్మన్ లాంగ్వేజ్ పై ప్రత్యేక కార్యక్రమాన్ని టి-సాట్ ప్రసారం చేసిందని గుర్తు చేశారు. కాలిగ్రఫి పై సందేహాలకు 040-23540326/726 టోల్ ఫ్రీ నంబర్ 1800 425. 4039 లకు కాల్ చేయాలని సూచించారు.

## పలు చోరీలకు పాల్పడిన ముగ్గురు అరెస్టు

జగిత్యాల : జగిత్యాల జిల్లాలో పలు చోరీలకు పాల్పడ్డ ముగ్గురిని మెట్పల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 6 లక్షల రూపాయల విలువగల ఒక మోటార్ సైకిల్, 30 కిలోల కాపర్ వైర్, 30 వ్యవసాయ కరెంటు మోటార్లు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ సమక్షంలో అరెస్టు అయిన ముగ్గురిని చూపించి వివరాలు వెల్లడించారు. మెట్ పల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కుంచేపు వెంకటేష్, మల్లాపూర్ మండలం రాఘవపేటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సూర్యవంశీ సాయికుమార్, మెట్పల్లి కి చెందిన అబ్దుల్ ఖాదర్ ముగ్గురు మూడు రకాల చోరీలకు పాల్పడినట్లు ఎస్పీ తెలిపారు. తాళం వేసిన ఇళ్ళు, మోటార్ సైకిళ్లు, వ్యవసాయ కరెంటు మోటార్లు లక్ష్యంగా మెట్పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కథలాపూర్ మండలాల్లో పలు చోరీలకు పాల్పడ్డారని చెప్పారు. చోరీల పై మెట్ పల్లి సబ్ డివిజన్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టగా ముగ్గురు పట్టుబడ్డారని ఎస్పీ తెలిపారు.

### కల్వచర్లలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో

## ఉచిత కంటి వైద్య శిబిరం

**- పేదవారి కోసం 220 రూపాయలకే ఉచిత కంటి ఆపరేషన్**

**- గంట వెంకట రమణారెడ్డి , డాక్టర్ శరణ్య మారుతి యాదవ్**

కమాన్ పూర్ : లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటనరీ కాలనీ రేకుర్తి కంటి ఆసుపత్రి కరీంనగర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి, క్లబ్ డైరెక్టర్ గంట వెంకట రమణారెడ్డి మరియు ప్రకృతి వైద్య నిపుణురాలు, క్లబ్ డైరెక్టర్ డాక్టర్ శరణ్య మారుతి యాదవ్ సహకారంతో తేది.17-02-2025 సోమవారం రోజున ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు కల్వచర్ల గ్రామ పరిధిలోని గోకుల్ నగర్ హెచ్ పి పెట్రోల్ బంక్ ఎదురుగా యాదవ్ సంఘ భవనం నందు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ వైద్య శిబిరంలో కంటి చూపులో లోపాలున్న వారికి డాక్టర్లచే పరీక్ష చేయించి వారిలో మోతే బిందు (కంటిలో శుక్లాలు) ఉన్నవారిని గుర్తించి ఆపరేషన్ అవసరమైన వారిని వెంటనే రేకుర్తి కంటి ఆసుపత్రికి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ కరీంనగర్ తీసుకువెళ్లి రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించబడును. అలాగే ఆసుపత్రి నందు భోజనం, వసతి, కంటి అద్దాలు, మందులు ఉచితంగా ఇవ్వబడును. బయట కార్పొరేట్ ఆసుపత్రిలో ఇట్టి ఆపరేషన్ కి 15 నుండి 20వేల రూపాయలు ఖర్చు అవుతుంది కానీ పేదవారికి సహాయం చేయాలని సంకల్పంతో లయన్స్ క్లబ్ మరియు రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సహకారంతో కేవలం 220 రూపాయలకే ఇట్టి ఆపరేషన్ చేయించడం జరుగుతుంది. కావున రామగిరి మండల ప్రాంత ప్రజలు ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతూ కంటి ఆపరేషన్ కి వచ్చి వారు తమ వెంట ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డ్ ,మొబైల్ ఫోన్, బ్లాంకెట్ వెంట తీసుకొని రాగలరు మరియు రక్త పరీక్షల నిమిత్తము 220 రూపాయలు తెచ్చుకోగలరని కోరారు. డాక్టర్ శరణ్య మారుతి యాదవ్ 9014255745 లను సంప్రదించాలని తెలిపారు.

# కమలంలో కొత్త కయ్యం




హైదరాబాద్ : తెలంగాణ బీజేపీలో జిల్లా అధ్యక్షుల నియామకం రచ్చకు దారి తీస్తోంది. ఇప్పటివరకు 23 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించారు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి. అయితే పలు జిల్లా అధ్యక్షుల ఎంపిక పార్టీలో అసంతృప్తులకు దారి తీస్తోంది. తాము సూచించినవారికి కాకుండా మరో నేతకు అవకాశం ఇచ్చి..తమకు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు చెప్పిన వారికి కాకుండా వేరే వారికి ఎలా బాధ్యతలు కట్టబెడతారని ప్రశ్నిస్తున్నారు నేతలు.పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా..ఎవరికి పడితే వారికి జిల్లా అధ్యక్ష పోస్ట్ ఇచ్చారని గరం గరం అవుతున్నారు పలువురు నేతలు. కొన్ని చోట్ల స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు చెప్పినవారికి మాత్రమే మండల, జిల్లా అధ్యక్ష పదవులు ఇచ్చింది బీజేపీ స్టేట్ హైకమాండ్. మరికొన్ని జిల్లాల్లో మాత్రం లోకల్ లీడర్ల ఓపీనియన్‌ను లెక్కలోకి తీసుకోలేదట. ఇక కొందరు నేతలు ఎమ్మెల్సీ టికెట్ ఆశిస్తే అదీ దక్కకా..జిల్లా అధ్యక్ష పదవి కూడా ఇవ్వకపోవడంతో ఆగ్రహంతో రగిలిపోతున్నారట. ఒకే ఇంట్లో రెండు పోస్టులు ఇవ్వడంపై కూడా పలువురు నేతలు మండిపడుతున్నారట.ఇక ఎమ్మెల్యే రాజాసింగ్ విడుదల చేసిన ఆడియో పార్టీలో సంచలనంగా మారింది. రాజాసింగ్ అంటే హిందుత్వం, హిందుత్వం అంటే రాజాసింగ్ అన్న బ్రాండ్ ఉంది. ఆయన రాష్ట్రంలోనే కాకుండా పలు రాష్ట్రాల్లో జరిగే హిందువుల సమావేశాల్లో పాల్గొంటారు. జాతీయ స్థాయిలో సంఘ్‌లో ఆయనకు మంచి గుర్తింపు ఉంది. అలాంటి నేత నియోజకవర్గంలోనే సొంత పార్టీ నేతలు మరో వర్గాన్ని తయారు చేసే పనిలో పడ్డారన్న గుసగుసలు వినబడుతున్నాయి.గోల్కొండ జిల్లా అధ్యక్షుడిగా ఉమా మహేందర్‌ను ప్రకటిస్తారంటూ ముందుగా లీకులు వచ్చాయి. దీనిని రాజాసింగ్ వ్యతిరేకించడంతో 10రోజులు పాటు జిల్లా అధ్యక్షుడి పేరు ప్రకటనను వాయిదా వేశారు. ఆ తర్వాత ఉమా మహేందర్ పేరునే గోల్కొండ జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించడంతో రాజాసింగ్ బరస్ట్ అయిపోయారు. వెంటనే ఒక ఆడియో రిలీజ్ చేసిన రాజాసింగ్ పార్టీకి తన అవసరం లేదనుకుంటే నో ప్రాబ్లమ్..తాను ఏం చేయాలో అది చేస్తానంటూ హెచ్చరికలు జారీ చేశారుగోల్కొండ జిల్లా అధ్యక్షుడిగా తాను సూచించిన వ్యక్తి పేరు కాకుండా వేరే వ్యక్తిని ప్రకటించడంతో రాజాసింగ్ రాష్ట్ర నాయకత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు సన్నిహితుల దగ్గర తన ఆవేదన చెప్పుకున్నారట. పార్టీలో చేరినప్పటి నుంచి ఓ వైపు ఎంఐఎంతో మరోవైపు సొంత పార్టీ నేతలతో పోరాటం చేస్తున్నానని బాధపడుతున్నారట. ఈ మధ్య పార్టీలో వేధింపులు మరీ ఎక్కువ అయ్యాయని మధనపడుతున్నట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.రాజాసింగ్ రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమైనట్లు టాక్. పార్టీలో కొంతమంది బ్రోకరిజం చేస్తున్నారని..తన సన్నిహితుల దగ్గర బాధను చెప్పుకున్నారట రాజాసింగ్. గోల్కొండ జల్లా బీజేపీ అధ్యక్ష పదవి బీసీ లేదా ఎస్సీకి ఇవ్వాలని తాను సూచిస్తే..ఎంఐఎం పార్టీలో తిరిగే వ్యక్తికి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు రాజాసింగ్.రాష్ట్ర బీజేపీలోని ఓ అగ్రనాయకుడికి ఫోన్ చేసి జిల్లా అధ్యక్ష నియామకంపై ఆరా తీశారట రాజాసింగ్. సదరు నేత తనకు తెలియకుండానే ఇది జరిగిందని నిర్లక్ష్యమైన సమాధానం ఇచ్చారట. దాంతో ఇప్పటికే ఎంఐఎం, కాంగ్రెస్‌తో యుద్ధం చేస్తున్నానని..రాష్ట్ర నాయకత్వంతో వేధింపులకు గురి అవుతున్నానని మరింత ఆవేదన చెందుతున్నారట రాజాసింగ్.తన నియోజక వర్గంలో కూడా పుల్లలు పెడితే పార్టీకి రిజైన్ చేసేందుకు కూడా వెనకాడబోనని తనకు అత్యంత సన్నిహితంగా ఉండే ఓ పార్టీ నేతకు చెప్పినట్టు సమాచారం. జిల్లా అధ్యక్షుడిని మార్చేందుకు రాష్ట్ర అధ్యక్షుడికి రెండు రోజుల సమయం ఇస్తానని..ఒక వేళ మార్చకపోతే తానేంటో చూపిస్తానని రాజాసింగ్ అనడం పార్టీలో కలకలం రేపుతోంది. తాను మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నానని..17న తిరిగి వచ్చిన తర్వాత తన భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని ఆయన చెప్పినట్లు సమాచారం.ఇదంతా ఇలా ఉంటే మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రఘునాథరావు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్ ఆశించారు. ఆయనకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వకపోగా జిల్లా అధ్యక్ష బాధ్యతల నుంచి కూడా తప్పించారు. కానీ మరో బీజేపీ నేత అంజిరెడ్డికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. అంతేకాదు అంజిరెడ్డి భార్య గోదావరిని సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా నియమించడం రాష్ట్ర బీజేపీలో చర్చనీయాంశంగా మారింది.బీజేపీ కుటుంబ పార్టీ కాదని చెప్పుకునే మనం..ఒకే ఇంట్లో ఇద్దరికి అవకాశాలు ఇవ్వడమేంటని సొంత పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారట. అసలు మెదక్ జిల్లా ప్రజలకే పెద్దగా పరిచయం లేని అంజిరెడ్డిని నాలుగు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమించడం ఏంటో అర్థం కావడం లేదంటున్నారట నేతలు. పైగా అంజిరెడ్డి సతీమణికి సంగారెడ్డి జిల్లా బాధ్యతలు అప్పగించడం కూడా చాలా మంది నేతలకు మింగుడు పడటం లేదట. ఓవైపు మెదక్ ఎంపీగా ఉన్న రఘునందన్‌రావుతో అంజిరెడ్డికి ఎప్పటినుంచో గ్యాప్ ఉందట.కొత్తగా కేంద్ర మంత్రి బండిసంజయ్‌తో కూడా అంజిరెడ్డికి పొసగడ లేదన్న టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఏరికోరి మరీ అంజిరెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పెట్టడం వెనుక అంతర్యమేంటని కమలం పార్టీ నేతలనే గుసగుసలు పెట్టుకుంటున్నారు. స్థానికంగా ఉన్న ఓ కీలక ప్రజాప్రతినిధి వ్యతిరేకించినప్పటికీ గోదావరికి జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడం కూడా చర్చకు దారి తీస్తోంది.మరోవైపు పెద్దపల్లి, భువనగిరి జిల్లా అధ్యక్షుల నియామకం కూడా పార్టీలో అంతర్గతంగా పోరుకు దారితీసాయి. మరోవైపు షాద్‌నగర్ జిల్లా అధ్యక్ష పదవి విషయంలో ఎంపీ డీకే అరుణ, రంగారెడ్డి అధ్యక్ష పదవి విషయంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. తాను ఐదు పేర్లు సూచిస్తే పట్టించుకోకుండా ఆరో వ్యక్తి వైపు మొగ్గు చూపడంతో కొండా కోపంగా ఉన్నారని టాక్.అయితే మిగతా నేతల సంగతి ఎట్లున్నా..రాజాసింగ్ రూటే సెపరేట్. ఆయన ఇప్పటికే పలుసార్లు రాష్ట్ర బీజేపీ నాయకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈసారి కాస్త బరస్ట్ అయిన రాజాసింగ్ తన దారి తాను చూసుకుంటారా లేక అధిష్టానం ఆయన డిమాండ్‌కు లొంగుతుందా అనేది వేచి చూడాలి మరి.

# నోటా ఓట్ల శాతంలో క్రమేపీ క్షీణత

న్యూఢిల్లీ : ఇవిఎంలలో 'పైవారు ఎవరూ కాదు' ఆప్షన్ 2013లో ప్రవేశపెట్టినప్పటి నుంచి 2024 లోక్‌సభ ఎన్నికల్లో అత్యల్ప శాతం నమోదైనట్లు ఎన్నికల కమిషన్ (ఇసి) డేటా వెల్లడించింది. నోటా ఆప్షన్‌ను మొదటిసారి 2014 లోకసభ ఎన్నికల్లో అమలులోకి తీసుకువచ్చారు. నిరుటి లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన డేటా ఉన్న పుస్తకం ఎన్నికల కమిషన్ 'అట్లాస్ 2024' ప్రకారం, గడచిన మూడు లోక్‌సభ ఎన్నికల్లో నోటా వోట్లలో క్రమంగా క్షీణత ఉన్నది. 2014లో 1.08 శాతంగా ఉన్న నోటా వోట్లు 2024 ఎన్నికల్లో 0.99 శాతానికి తగ్గాయి. వోట్ల శాతం స్వల్పంగా కనిపించినప్పటికీ, నోటా వోట్ల మొత్తం సంఖ్య, ముఖ్యంగా తక్కువ గెలుపు తేడాలు ఉన్న సీట్ల విషయంలో ఇప్పటికీ గణనీయంగానే ఉన్నది.కొన్ని నియోజకవర్గాల్లో నోటా వోట్లు ఫలితాలను ప్రభావితం చేసి ఉండేవే. రాష్ట్రాల వ్యాప్తంగా నోటా వోట్ల పంపకం గణనీయమైన అంతరాన్ని ప్రదర్శిస్తోంది. ప్రాంతీయ రాజకీయ చిత్రాన్ని, వోటర్ల ప్రాధాన్యాలను, రాజకీయ పాత్ర స్థాయిలను అది ప్రతిబింబిస్తోంది. బీహార్ అత్యధిక నోటా వోట్ల వాటా (పర్సంటేజ్) 2.07 శాతాన్ని నమోదు చేయగా, దాద్రా నగర్ హవేలి, దామన్ దయ్యూ 2.06 శాతం, గుజరాత్ 1.58 శాతంతోఆ తరువాతి స్థానాల్లో నిలిచాయి. అందుకు భిన్నంగా నాగాలాండ్ కేవలం 0.21 శాతంతో నోటా వోట్ల అత్యల్ప వాటాను నమోదు చేసింది. రాష్ట్రంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల పట్ల ప్రాధాన్యాన్ని లేదా బలమైన నవీకరణాన్ని అది సూచిస్తోంది.రాష్ట్రాల వ్యాప్తంగా అటువంటి భిన్న సరళులను రాజకీయ పోటీ, ప్రాంతీయ పార్టీల ప్రాముఖ్యం, ఒక్కొక్క ప్రాంతంలో మొత్తంగా వోటర్ల ప్రాథమ్యం వంటి అంశాలు ప్రభావితం చేసి ఉండవచ్చు. ఆ అంతరం విభిన్న మార్గాలను ఎత్తిచూపుతోంది. ఎన్నికల ప్రక్రియతో వోటర్ల ప్రమేయం, ఒక అభ్యర్థిని ఎంచుకోవడంలో క్రియాశీలకంగా పాల్గొనడం లేదా నిరసన లేక అసమ్మతి సూచనకు ఒక సాధనంగా నోటా వినియోగం ద్వారా వారి ప్రాధాన్యాల వ్యక్తీకరణను అది ప్రతిబింబిస్తోంది. 2013లో ప్రవేశపెట్టగా, ఇవిఎంలపై నోటా ఆప్షన్‌కు నల్ల క్రాస్‌తో ఒక బ్యాలట్ పత్రం రూపంలో సొంత చిహ్నం ఉంది.సుప్రీం కోర్టు 2013 సెప్టెంబర్‌లో ఒక ఉత్తర్వు జారీ చేసిన అనంతరం వోటింగ్ ప్యానెల్‌పై చివరి ఆప్షన్‌గా ఇవిఎంలపై నోటా మీటను ఇసి చేర్చింది. సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వుకు ముందు, ఏ అభ్యర్థికీ వోటు వేయకూడదనుకునే వారికి ఫార్మ్ 49ఒను పూర్తి చేసే ఆప్షన్ ఉండేది. అయితే, 1961 నాటి ఎన్నికల నిర్వహణ నిబంధనావళిలోని 49ఒ నిబంధన కింద పోలింగ్ కేంద్రంలో ఆ ఫారమ్‌ను నింపడం వోటర్ గోప్యతకు భంగం కలిగినట్లు అయ్యేది. అయితే, వోటింగ్ సమయంలో నోటా ఆప్షన్‌ను మెజారిటీ వోటర్లు వినియోగించుకున్నట్లయితే, తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఇసిని ఆదేశించడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది.

# ఫోన్ ట్యాపింగ్ కథ కంచికేనా?

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ౦2గా ఉన్న ఎస్ఐబీ మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావుకు ఊరట లభించింది. పలు దఫాలుగా విచారణ చేపట్టిన నాంపల్లి సెషన్స్ కోర్టు ప్రణీత్‌రావుకు బెయిల్ మంజూరు చేసింది. ప్రణీత్‌రావు చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై లాయర్ ఉమామహేశ్వరరావు ఫిబ్రవరి 11న ప్రణీత్ రావు తరపున వాదనలు వినిపించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివారెడ్డి విచారణకు హాజరుకాకపోవడంతో పీపీ వాదనల కోసం విచారణ నేటికి వాయిదా వేశారు. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఇతర నిందితులకు కోర్టులు బెయిల్ ఇచ్చాయని, ప్రస్తుతం ప్రణీత్ రావు ఒక్కరే జైలులో ఉన్నాయని లాయర్ ఉమామహేశ్వర రావు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ అడిషినల్ ఎస్పీ భుజంగరావు, మాజీ డీసీపీ ప్రభాకర్ రావులకు




తెలంగాణ హైకోర్టు జనవరి 31న మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మరో నిందితుడిగా ఉన్న అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిందని వాదనలు వినిపించారు. ప్రణీత్ రావు బెయిల్ పిటిషన్ పై ఇరువైపుల వాదనలు విన్న జడ్జి జస్టిస్ రమాకాంత్ రెగ్యూలర్ బెయిల్ మంజూరు చేశారు.

బెయిల్ మంజూరు కావడంతో ప్రణీత్ రావు త్వరలో విడుదల కానున్నారని ఆయన లాయర్ ఉమామహేశ్వరరావ తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్షనేతలైన కాంగ్రెస్, బీజేపీ నేతల ఫోన్లు ట్యాపింగ్ అయినట్లు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దర్యాప్తు మొదలుపెట్టింది. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని దర్యాప్తులో తేలింది. ఎస్ఐబీలో ఉన్న 17 కంప్యూటర్లలో మొత్తం 42 హార్డ్ డిస్క్‌లను తొలగించి.. వాటి స్థానంలో కొత్తవి అమర్చారు ప్రణీత్ రావు. పోలీస్ విచారణలో ప్రణీత్ రావు ఈ విషయాన్ని అంగీకరించారని అధికారులు తెలిపారు. మూసీ నదిలో నాలుగో బ్రిడ్జి కింద హార్డ్ డిస్క్ సంబంధించి శకలాలు గుర్తించారు. తమ వివరాలు తెలిసిపోతాయని హార్డ్ డిస్కులు ధ్వంసం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని సీరియస్ గా తీసుకుని ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో మాజీ ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావును మొదట అరెస్ట్ చేసింది. విచారణలో తెలిసిన సమాచారం ఆధారంగా అనంతరం అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నను సైతం పోలీసులు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్ష నేతల ఫోన్లతో పాటు సినీ సెలబ్రిటీలు, ఇతర ప్రముఖుల ఫోన్లు సైతం ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఫోన్లు ట్యాప్ చేసి వారికి సంబంధించిన రాజకీయ, వ్యక్తిగత విషయాలు తెలుసుకున్నారని విచారణలో ఒక్కో విషయం వెల్లడవుతోంది. అయితే ఈ కేసులో ఒక్కొక్కరిగా టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, ఎస్పీ భుజంగరావు, తిరుపతన్నలకు కోర్టులు బెయిల్ మంజూరు చేశాయి. తాజాగా ప్రణీత్ రావుకు నాంపల్లి సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

# భయపెడుతున్న కొరియర్ స్కామ్

నల్గొండ : ఇటీవల కాలంలో సైబర్ మోసాలు పెరిగిపోయాయి. మీ కొరియర్ లో అక్రమ వస్తువులు ఉన్నాయంటూ ఫోన్ చేసి డబ్బు కాజేసేందుకు ప్రయత్నిసున్నారు. ఈ ఘటనల నేపథ్యంలో ప్రముఖ కొరియర్ సంస్థ ఫెడెక్స్... ప్రజలను అప్రమత్తం చేస్తూ కీలక ప్రకటన చేసింది. ఫెడెక్స్ ఉద్యోగుల పేరిట కొందరు మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ తరహా మోసాలతో బాధితులు ఆర్థికంగా, మానసిక నష్టపోతున్నారని పేర్కొంది.ఆర్థిక మోసగాళ్లు ఫెడెక్స్ లేదా ఇతర కొరియర్ సంస్థల ప్రతినిధులుగా చెబుతూ... మీ పార్సెల్‌లో అక్రమ వస్తువులు ఉన్నాయని తప్పుడు ఆరోపణలు చేస్తారు. బాధితులను నకిలీ పోలీస్ అధికారులతో బెదిరించి, న్యాయపరమైన చర్యలు లేదా డిజిటల్ అరెస్ట్ పేరుతో ముప్పుతిప్పలు పెడుతున్నారు.

ఈ సమస్యను పరిష్కరించుకోవాలంటే తక్షణమే డబ్బు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు ఒత్తిడి తెస్తారు. వెంటనే డబ్బు పంపాలని, లేకపోతే అరెస్టు చేస్తామని హడావుడి చేస్తారు. ముందు కొంత మొత్తం చెల్లించాలని ఓ లింక్ పంపుతారు. డబ్బులు పంపిస్తే ...ఇక మోసగాళ్లు అదృశ్యమవుతారు. బాధితులు పూర్తిగా నష్టపోతారు.

ఫెడెక్స్ సూచనలు..ఫెడెక్స్ ఎప్పుడూ అనవసరమైన ఈ-మెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా మీ వ్యక్తిగత సమాచారం లేదా అకౌంట్ వివరాలు కోరదు. ఫెడెక్స్ పోలీసు అధికారులతో ఎలాంటి సంబంధం కలిగి ఉండదు. వారి తరఫున చర్యలు తీసుకోదు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలి. ఫెడెక్స్ లేదా ఇతర కొరియర్ సంస్థల పేరుతో బెదిరింపులు వచ్చినా నమ్మవద్దు. ఎవరైనా ఫెడెక్స్ లేదా కొరియర్ సంస్థల పేరిట బెదిరిస్తూ డబ్బు అడిగితే, వెంటనే పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ విభాగానికి తెలియజేయండి. ఎవరైనా మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయండి లేదా వెబ్‌సైట్‌లో రిపోర్ట్ చేయండి.

ముఖ్యమైన చిట్కాలు

ఫెడెక్స్ లేదా ఇతర కొరియర్ సంస్థల పేరుతో అనవసరమైన సందేశాలు, కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

ఏమైనా అనుమానాస్పద సమాచారం ఉంటే, అధికారిక కస్టమర్ కేర్ ద్వారా నిర్ధారించుకోవాలి.

పూర్తి సమాచారం తెలుసుకునే వరకు, డబ్బులు పంపకండి లేదా వ్యక్తిగత సమాచారం తెలియజేయవద్దు.

మోసాలకు గురైతే, స్థానిక పోలీసులకు తెలియజేయండి లేదా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించండి.

# జయలలిత ఆస్తులు సర్కారర్పణం

**468 రకాల బంగారం, వజ్రాలు**
**700 కిలోల బరువున్న వెండి ఆభరణాలు,**
**740 ఖరీదైన చెప్పులు, 10344 పట్టు చీరలు**

చెన్నై : ఏఐడీఎంకేలో కీలకంగా ఉన్న దివంగత జయలలిత 1991లో తొలిసారి తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 1996లో అధికారంలోకి వచ్చిన డీఎంకే హయాంలో ఆమె ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని ఆరోపిస్తూ కేసు నమోదైంది. జయలలిత దత్తపుత్రుడిగా చెప్పబడే సుధాకరన్ వివాహం 1995లో ఒక వేడుకగా అంగరంగవైభవంగా జరిగింది. ఆతర్వాత డీఎంకే అధికారంలోకి రాగానే అవినీతి అక్రమాల కేసు నమోదైంది. జయలలితతోపాటు ఆమె సన్నిహితురాలు శశికళ, సుధాకరన్, ఇళవరసి నలుగురిపై కూడా నమోదైంది. కేసు విచారణ తమిళనాడులో ఉంటే ప్రభావితం ఉంటుందన్న పిటిషన్ తో కర్ణాటక కోర్టుకు బదిలీ కాగా అక్కడే విచారణ జరిగింది. ఈ కేసును బెంగళూరులోని ప్రత్యేక కోర్టు దర్యాప్తు చేస్తుండగా, 2014లో వారందరికీ నాలుగు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. కర్ణాటక హైకోర్టు అప్పీలు చేయడంతో శిక్షను రద్దు చేసింది. కానీ ఈ ఉత్తర్వును కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు.జయలలిత సహా నలుగురికి బెంగళూరు ప్రత్యేక కోర్టు విధించిన శిక్షను సుప్రీంకోర్టు సమర్థించింది. కానీ సుప్రీంకోర్టు తీర్పు రాకముందే, జయలలిత అనారోగ్యంతో డిసెంబర్ 5, 2016న మరణించారు. దీని తరువాత, ముగ్గురూ ? శశికళ, ఇళవరసి. సుధాకరన్ బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలులో నాలుగు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. వారి మొత్తం శిక్ష పూర్తయిన తర్వాత వారిని విడుదల చేశారు.జయలలితపై ఉన్న ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో, ఆమె ఆస్తులన్నీ 2004లో కర్ణాటక ప్రభుత్వ ఖజానాకు బదిలీ అయ్యాయి. మొదట తమిళనాడులో ఉన్న కేసును కర్ణాటకకు బదిలీ చేసి, అక్కడ స్వాధీనం చేసుకున్న వస్తువులను కూడా అక్కడికే తీసుకెళ్లారు. ప్రస్తుతం బెంగళూరులోని ప్రభుత్వ ఖజానాలో జయలలిత ఆస్తుల్లో పది వేల చీరలు, 750 జతల చెప్పులు, ఖరీదైన గడియారాలు, బంగారు, వజ్రాల ఆభరణాలు ఉన్నాయి. తాజాగా సీబీఐ కోర్టు జయలలిత నుంచి స్వాధీనం చేసుకున్న 27 కిలోల నగలు, 1562 ఎకరాల భూమిని ఫిబ్రవరి 14- 15 తేదీలలో తమిళనాడు అవినీతి నిరోధక శాఖకు అప్పగించాలని ఆదేశించింది. నగలు సహా పత్రాలను తీసుకెళ్లడానికి ఆదేశాలు వచ్చాయి.. దీంతో తమిళనాడు నుంచి ఏసీబీ అధికారులు పెట్టెలతో బెంగళూరుకు రావాలని ఆభరణాలను భద్రంగా తీసికువెళ్లేందుకు తగినంత భద్రత ఉండాలని.. ఆభరణాలను అంచనా వేయడానికి అప్రైజర్లు తప్పనిసరిగా హాజరు కావాలని అధికారులు సూచించారు.. ప్రతిదీ సరిచూసుకున్న తర్వాతే వాటిని ఏసీబీ అప్పగించాలని కోర్టు ఆదేశించింది. దీనికి సంబంధించిన భద్రతా పనులను కర్ణాటక పోలీసులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించింది. శుక్రవారం బెంగళూరు లో తమిళనాడు నుంచి వచ్చిన అధికారులకు.. జయలలితకు చెందిన ఆభరణాలు, వస్తువులు.. ఆస్తుల పత్రాలను అప్పగించారు.జయలలిత ఆభరణాలను తిరిగి ఇచ్చే ప్రక్రియలో తమిళనాడు హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐజిపి విజిలెన్స్ హాజరయ్యారు. ఆభరణాలను తీసుకెళ్లడానికి 6 ట్రంక్‌లను తీసుకురాగా కోర్టు ఆదేశాలతో వీడియోగ్రాఫర్, ఫోటోగ్రాఫర్‌ను తీసుకువచ్చారు. అధికారులు ఈరోజు కోర్టులోని వస్తువులను స్టాక్ చేస్తున్నారు. కర్ణాటకకు రూ. 5 కోట్ల వ్యాజ్య రుసుము ఇంకా చెల్లించాల్సి ఉంది. పట్టుచీరల విలువ కట్టేందుకు ౹ాఖఖ కిరణ్ టెక్స్‌టైల్స్ ప్రతినిధులు, న్యాయవాదులు హాజరయ్యారు.జయలలితకు చెందిన వస్తువుల్లో 468 రకాల బంగారం, వజ్రాలు పొదిగిన ఆభరణాలు ఉన్నాయి. 700 కిలోల బరువున్న వెండి ఆభరణాలు, 740 ఖరీదైన చెప్పులు, 10344 పట్టు చీరలు, 250 శాలువాలు, 12 రిఫ్రిజిరేటర్లు, 10 టీవీల సెట్లు, 8 ఎఅఖీలు, 1 వీడియో కెమెరా, 4 అఅ ప్లేయర్లు, 2 ఆడియో డెక్‌లు, 24 టూ-ఇన్-వన్ టేప్ రికార్డర్, 1040 వీడియో క్యాసెట్లు, 3 ఇనుప లాకర్లు ఉన్నాయి


# కిరణ్ రాయల్‌ను వదిలేది లేదు

తిరుపతి : జనసేన నేత కిరణ్ రాయల్ పై లక్ష్మి సంచలన కామెంట్స్ చేశారు. ఇటీవల కిరణ్ రాయల్ పై లక్ష్మి అనే మహిళ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కిరణ్ రాయల్ కూడా వాటిని ఖండించారు. అయితే లక్ష్మిని ఇటీవల జైపూర్ పోలీసులు అరెస్ట్ చేసి, కోర్టు బెయిల్ ఇచ్చిన అనంతరం విడుదల చేశారు. శనివారం తిరుపతికి వచ్చిన లక్ష్మి మీడియా సమావేశం నిర్వహించి సంచలన విషయాలు వెల్లడించారు. ఈ ఆరోపణలు ప్రస్తుతం ఏపీలో దుమారం రేపుతున్నాయి.లక్ష్మి మాట్లాడుతూ.. తనను దౌర్జన్యంగా జైపూర్ పోలీసులు అరెస్ట్ చేశారని, లోకల్ పోలీసులు లేకుండా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఒక వెధవను వెధవా అని నిరూపించేందుకు ఇన్ని ఇబ్బందులు ఉంటాయని, తనకు ఇప్పుడే తెలిసిందన్నారు. తనను అరెస్ట్ చేసి జైపూర్ పోలీసులు కోర్టు ముందు హాజరుపరిస్తే, 41 ఏ నోటీసులు ఇచ్చారా అంటూ జడ్జి అడిగిన ప్రశ్నకు పోలీసుల వద్ద సమాధానం లేదన్నారు. తనను జైపూర్ పోలీసుల ద్వారా కిడ్నాప్ చేయాలని ప్రయత్నించారని ఆమె విమర్శించారు.వైసీపీ నాయకుల మద్దతు ఉందని కిరణ్ రాయల్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన సమయంలో తనకు ఉన్న ఏకైక ప్రాపర్టీని అమ్ముకొని బెయిల్ పొందానన్నారు. అబ్దుల్ ఘనీ తన గురించి చెబుతున్న ఆరోపణల్లో నిజం లేదని, ఆటోడ్రైవర్ కు ముందు కిరణ్ రాయల్ అనుచరుడిగా ఘనీ ఉన్నట్లు ఆమె తెలిపారు. కిరణ్ రాయల్ ఏమి చెప్పినా చెల్లిపోతుందని అనుకుంటున్నాడని, ఇక్కడ ఎవరూ అంత అమాయకులు లేరన్నారు.తనతో కిరణ్ రాయల్ సన్నిహితంగా ఉన్న సమయంలో చాలా విషయాలు వెల్లడించినట్లు లక్ష్మి అన్నారు. పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ తన వెంట ఉన్నారని ఎప్పుడూ చెప్పేవాడన్నారు. తన వద్ద పవన్ రహస్య జీవితానికి సంబంధించిన పెన్ డ్రైవ్ ఉందని, తనను పవన్ ఏమి చేయలేడని చాలా సార్లు చెప్పినట్లు ఆమె ఆరోపించారు. మాజీ మంత్రి రోజా దగ్గరి బంధువును కూడా కిరణ్ రాయల్ ట్రాప్ చేశారని, అవసరానికి వాడుకొని అవసరం తీరాక, ఆమెపై దాడి చేసిన చరిత్ర కిరణ్ రాయల్ కే దక్కుతుందని సంచలన కామెంట్స్ చేశారు.

ఆ కారణం వల్లే వైసీపీ ప్రభుత్వ హయాంలో కిరణ్ రాయల్ ను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన కారణం వేరైతే, పార్టీ కోసం అంటూ కిరణ్ బిల్డప్ ఇచ్చారన్నారు. తనకు టైమ్ వస్తే పవన్ నే బెదిరిస్తానని, నువ్వెంత అంటూ కిరణ్ రాయల్ చాలా సార్లు బెదిరించినట్లు లక్ష్మి చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. జైపూర్ నుండి వచ్చిన లక్ష్మి.. మీడియా సమావేశం ఏర్పాటు చేసిన కామెంట్స్ ఇప్పుడు ఏపీలో హాట్ టాపిక్ గా మారాయి.

ఇంతకు లక్ష్మి చేసిన ఆరోపణలు నిజమేనా? కిరణ్ రాయల్ వద్ద పెన్ డ్రైవ్ ఉన్న మాట వాస్తవమేనా? ఆ పెన్ డ్రైవ్ లో ఏముందన్నది ఇప్పుడు చర్చ సాగుతోంది. ఈ అనుమానాలకు తెర పడాలంటే లక్ష్మి చేసిన ఆరోపణలకు కిరణ్ రాయల్ స్పందించాల్సి ఉంది.

# బాబోయ్..కోతులు..!



**వేద న్యూస్, పెద్దపల్లి :**

పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కొన్ని గ్రామలలో కోతుల బెడద రోజురోజుకు పెరుగుతోంది. కోతులు గుంపులుగుంపులుగా బయలుదేరి కాలనీలపై విరుచుకుపడుతున్నాయి. ఇళ్ల, దుకాణాలలో తినుబండరాలు, వస్తువులను ఎత్తుకెళ్లడంతో పాటు ఇండ్లపై కప్పులు,రేకులను ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలపై దాడులకు దిగుతూ గాయపరుస్తున్నాయి. కోతుల భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కోతుల నియంత్రణ కోసం అధికారులు చర్యలు చేపట్టాలని ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ కోతులు పట్టే వారినీ తీసుకువచ్చి నామమాత్రంగా నివారణ చర్యలు చెప్పటి చేతులు దులుపుకున్నారు అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అంతే కాకుండా ఎక్కువ మొత్తాల్లో బిల్లులు కాజేశారు అనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా కోతుల నియంత్రణ కోసం అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.



## సీఈవో, డిప్యూటీ సీఈవోల డైరీ ఆవిష్కరణ

**వేద న్యూస్, వరంగల్ :**

వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ, డిప్యూటీ సీఈవోల సంక్షేమ సంఘ నూతన 2025 డైరీని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డి.ఆర్.డి.ఓ కౌసల్యాదేవి, డిపిఓ కల్పన, డిప్యూటీ సీఈవో వసుమతి, తదితరులు పాల్గొన్నారు.

## ఆరె సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శిగా సుకినె సంతాజీ

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**



కాంగ్రెస్ ఎల్కతుర్తి మండల మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు సుకినె సంతాజీని ఆరె సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపెల్లి శివాజీ వెల్లడించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల పరిధిలోని దామెర గ్రామంలో శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. అనంతరం సభలో చెట్టుపెల్లి శివాజీ మాట్లాడుతూ.. ఆరె కులస్తులకు గత సర్కారు హైదరాబాద్ బోడుప్పల్‌లో కేటాయించిన విలువైన ఎకరం భూమిని కాపాడుటకు కాంగ్రెస్ నేత సుకినె సంతాజీ తన వంతు కృషి చేశారని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వద్దకు సంతాజీ సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేశారని స్పష్టం చేశారు. రూ.కోట్ల విలువైన భూమిని ఇతరులు కాజేసే ప్రయత్నం చేయగా, రక్షణకు ఆరె సంక్షేమ సంఘం నేతలకు సంతాజీ అండగా నిలిచారని వెల్లడించారు. ఈ క్రమంలోనే సంతాజీ సేవలను గుర్తించి ఆయన్ను రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తున్నట్టు శివాజీ స్పష్టం చేశారు.

## డాక్టర్ నలిమెల భాస్కర్‌కు జాతీయ పురస్కారం

**వేద న్యూస్, డెస్క్:**



సుప్రసిద్ధ సాహితీ వేత్త, ప్రముఖ అనువాద కులు, పరిశోధకులు, కవి, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ ను సిటీ కాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కారానికి (2025) ఎంపిక చేసినట్లు అవార్డు కమిటీ అధ్యక్షులు, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాలభాస్కర్ నేడొక ప్రకటనలో తెలియజేశారు. కవిత్వం, భాష, అనువాదం, పరిశోధన, విమర్శ తదితర రంగాల్లో డాక్టర్ నలిమెల భాస్కర్ చేసిన విశేషమైన కృషికి గాను వారిని ఈ పురస్కారానికి ఎంపిక చేసి నట్లు అవార్డు కమిటీ సభ్యులు వివరించారు. బహుముఖీన ప్రతిభాశాలిగా గుర్తింపు పొందిన డాక్టర్ నలిమెల భాస్కర్ వివిధ సాహిత్య ప్రక్రియల్లో 25 పైగా గ్రంథాలు వెలువరించాడని, తెలంగాణ భాష గురించి ప్రత్యేక పరిశోధన చేసి విలువైన గ్రంథాలు రచించాడని కమిటీ తెలియ జేసింది. కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వారి కాళోజీ పురస్కారం తో పాటు అనేక పురస్కారాలను డాక్టర్ నలిమెల భాస్కర్ అందుకున్నారు. అవార్డు కమిటీ కన్వీనర్ డాక్టర్ విప్లవ దత్ శుక్ల, సభ్యులు డాక్టర్ ఏలూరి యాదయ్య, డాక్టర్ కోయి కోటేశ్వరరావు నలిమెల భాస్కర్‌కు అభినందనలు తెలియజేశారు.



## పంచాయతీ సెక్రెటరీల సమస్యలపై వినతి

**వేద న్యూస్, హన్మకొండ :**

పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన సమస్యలపై హనుమకొండ జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రామాకాంత్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జీపీలకు నిధుల్లేకపోవడంతో పాటు ప్రజాప్రతినిధులు సైతం లేకపోవడంతో విధుల నిర్వహణ.. గ్రామాల్లో పారిశుధ్యం ఇతర కార్యకలాపాల నిర్వహించుట ఇబ్బందికరంగా మారిందని వివరించారు. తగు చర్యలు తీసుకోవాలని డీపీవోను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల ఫోరం హన్మకొండ జిల్లా అధ్యక్షుడు జనుగానీ అశోక్, ప్రధాన కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ వెంకటేశం,ఈ.సి.మెంబర్ అర్శం శ్రీనివాస్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వెంకన్న, ఉపాధ్యక్షులు మనోహర్, జాయింట్ సెక్రెటరీ శివ శంకర్, హనుమకొండ డివిజన్ అధ్యక్షుడు యాదగిరి, శ్వేత పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను కలిసిన ఆర్వీమహేందర్

**వేద న్యూస్, గోషామహల్:**



తెలంగాణ రాష్ట్ర సాధన స్వప్నాన్ని సాకారం చేసిన తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ తొలి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావును గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆర్‌వి మహేందర్ కుమార్ కలిశారు. సోమవారం ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ లో మాజీ సీఎం, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో చేపట్టబోయే ఉద్యమాలకు బీఆర్ఎస్ శ్రేణులు సమాయత్తం కావాలని మాజీ సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారని తెలిపారు.

# మహాసభలను విజయవంతం చేయండి

**వేద న్యూస్, మిర్యాలగూడ :**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ మహాసభ స్థానిక యూటీఎఫ్ భవనంలో నిర్వహించడం జరిగింది. ఈ డివిజన్ మహాసభకు ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ డబ్బికార్ మల్లేష్ హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందుకు ఎన్నికల మేనిఫెస్టోలో విద్యార్థులకు ఇస్తానన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ రాష్ట్రంలో రూ.8,350 కోట్లు పెండింగ్లో ఉంటే పేద మధ్యతరగతి విద్యార్థులు చదువులు ఏ విధంగా ముందుకు పోతాయో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మరో విద్యా సంవత్సరం ముగియడానికి వస్తున్న గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నుండి బకాయిల ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ ఇప్పటివరకు విడుదల చేయకుంటే భవిష్యత్తులో పరీక్షలు ముగియడానికి వస్తున్నాయన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని హెచ్చరించారు. భారత విద్యార్థి ఫేడరేషన్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో




మహాసభలు ప్రారంభం అయ్యాయని భవిష్యత్లో తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఖమ్మం జిల్లాలో జరగబోతున్నాయని ఈ మహాసభలలో దేశంలో రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై సమగ్రంగా చర్చించి విద్యార్థుల హక్కుల కోసం తెలంగాణ రాష్ట్రంలో ఒక ఛాంపియన్ లాగా ఎస్ఎఫ్ఐ పోరాటం నిర్వహిస్తుందని హెచ్చరించారు. నల్గొండ జిల్లా మహాసభలు ఫిబ్రవరి 19, 20 తేదీలలో నిర్వహించడం జరుగుతుంది ఈ మహాసభల్లో నల్గొండ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగా సమస్యలను అధ్యయనం చేసి నల్గొండ జిల్లా విద్యారంగ సమగ్ర అభివృద్ధి కోసం భవిష్యత్ కరాచరణ తయారు చేయడం కోసం ఈ మహాసభలు వేదిక కానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీను నాయక్, కుర్రసైదానాయక్, మూడవత్ జగన్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు సూర్య క్రాంతి, న్యూమాన్, ప్రసన్న, సంపత్,వీరన్న, చంటి, నాగ పుష్ప, బురాన్, అఖిల్, బన్నీ, చిన్న పాల్గొన్నారు.

# తెలంగాణ తెచ్చిన నాయకుడు కేసీఆర్

■ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి

**వేద న్యూస్ శాయంపేట:**

70 వసంతాలు పూర్తిచేసుకుని 71 వ సంవత్సరంలో అడుగు పెడుతున్న కేసీఆర్ పుట్టినరోజు వేడుకను శాయంపేట మండల కేంద్రంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సారథ్యంలో ఘనంగా జరుపుకోవడం జరిగింది. అనంతరం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ నిండు నూరేళ్లు ఆరారోగ్యాలతో ఉండాలని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. రాబోయే కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద బెట్టడం ఖాయమని తెలిపారు. వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా గోవిందాపూర్ టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసి శ్రావణ్



వ్యవసాయ క్షేత్రంలో కెసిఆర్ జన్మదిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ కుసుమ శరత్ ,మాజీ ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ మారపల్లి నందం, టిఆర్ఎస్ నాయకులు రామ్ శెట్టి లక్ష్మారెడ్డి,మారేపల్లి మోహన్, మాజీ ఉపసర్పంచ్ అరకెళ్ల ప్రసాద్ టిఆర్ఎస్వి జిల్లా నాయకులు కొమ్ముల శివ, కరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## 23 ఏళ్ల తర్వాత ఒకే చోట చిన్ననాటి దోస్తులు

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

చిన్ననాటి దోస్తులు 23 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకున్నారు. చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు హత్తుకొని అలాయి బలాయి చేశారు. ఆప్యాయంగా పలకరించుకొని, సెల్ఫీలు దిగుతూ బాల్య మిత్రులతో మళ్ళీ చిన్న పిల్లలుగా మారి అల్లరల్లరి చేశారు. చిన్నప్పుడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి వారిని శాలువా,మోమెంటోలతో ఘనంగా సత్కరించారు. సోమవారం వరంగల్ నగరంలోని మట్టేవాడ ఆంధ్ర విద్యాభి వర్ధిని (ఏవివి) ఉన్నత పాఠశాల 2001 - 2002లో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చదువులు నేర్పిన గురువులను ముఖ్య అతిథులుగా పిలిచుకున్నారు. ముందుగా చదువుకొనలేని ఎంతో మంది పేధల కోసం ఉచిత విద్యను అందించే ఆలోనతో పాఠశాలను నెలకొల్పిన మహనీయులు ఆచార్య చందా కాంతయ్య శ్రేష్ఠి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇటీవలే కాలంచేసిన ఉపాధ్యాయురాలు బాలా దేవి ఆత్మ శాంతి కై నిమిషం మౌనం పాటించిన అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి గురువులు మాట్లాడుతు క్రమశిక్షణతో చదువుకున్న మీరు మంచి ఉద్యోగాల్లో స్థిరపడి, ఆర్థికంగా నిలదొక్కుకుని, ఉన్నత స్థానాలకు ఎదగడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉందనీ, మిమ్మల్ని చూస్తుంటే మాకూ గత స్మృతులు గుర్తొస్తున్నాయి అనీ మేము విద్యాబుద్ధులు నేర్పిన విధ్యార్థులు ఈ రోజు ఇలా ఉన్నత స్థానాల్లో స్థిరపడటం చూసినప్పుడే మాకు ఎంతో ఆనందంగా ఉంటుందని అన్నారు. మీ అందరికీ మా ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల శాశ్వతకాల సభ్యులు చందా శ్రీకాంత్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు జగన్మోహన్ శర్మ, రాజేశ్వరి, వాసుదేవులు, ఫిలిప్ లాజరస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సంధ్యారాణి, పూర్వ విద్యార్థులు సంగీత , పాల అనిత, రమ, జ్యోతి, బీబీ తాహెరా, శిరీన్, ధనలక్ష్మి, స్వప్న, మానస, సరిత, లావణ్య, హేమ, రాకేష్ సింగ్, రాగం రాజు, కిరణ్ అంకతి శ్రవణ్, సుమన్, పసునూరి అజయ్, రవీందర్, తాత సురేష్, లింగబత్తిని రఘునాథ్, కోడి అజయ్, చక్రు, రాజేందర్ యుగంధర్, రంజిత్, రాంలాల్, పెరుగు రాజేష్, సట్ల సాంబశివుడు, బాలకృష్ణ, పవన్, పూర్ణచందర్, శంకర్‌లతో పాటు 62 మంది పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## కమలాపూర్‌కి కొత్త ఎంఈఓ

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల విద్యాధికారిగా కమలాపూర్ మండలం శనిగరం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న కే.శ్రీధర్ సోమవారం రోజున బాధ్యతలు స్వీకరించారు. గతంలో కమలాపూర్ మండల విద్యాధికారిగా పనిచేసినటువంటి రాంకిషన్ రాజు ఇటీవల పదవీ విరమణ పొందడంతో కమలాపూర్ ఎంఈఓ పోస్ట్ ఖాళీ ఏర్పడింది. దీనిని గుర్తించిన విద్యాశాఖ ఆ ఖాళీని భర్తీ చేయాలనే ఉద్దేశంతో శనిగరం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.శ్రీధర్‌ను కమలాపూర్ మండల విద్యాధికారిగా పదవి బాధ్యతలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో ఆయన సోమవారం రోజున పదవి బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓ గా బాధ్యతలు స్వీకరించిన కే శ్రీధర్ కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ కే శ్రీధర్ మాట్లాడారు. పాఠశాలల్లో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్, నాగేందర్, శ్రీనివాస్, స్వర్ణలత, స్రవంతి, కరుణ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, మడికొండ :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మడికొండ 64 డివిజన్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన సందర్భంగా 46, 64 డివిజన్ కార్యకర్తల సమక్షంలో కార్పొరేటర్ ఆవాల రాధికా రెడ్డి కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాధికా రెడ్డి మాట్లాడుతూ మన తెలంగాణ జాతిపిత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆయురారోగ్యాలతో ఉండాలని, ఈ తెలంగాణ ప్రజల బంగారు తెలంగాణ ఆకాంక్షలు నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో అబ్బ సాయిలు, వీరస్వామి, ఈదురు అనిల్, పల్లపు రాజ్ కుమార్, గంగారపు వీరేశం , బరిగల కృష్ణ, గోపనబోయిన రాజు, వస్కుల దేవేందర్, శ్రీనివాసరావు, ఆవాల నరోత్తం రెడ్డి, బత్తిని కిరణ్, మాచర్ల శ్రీధర్, పొన్నం శివ, తండా రఘు, ఓర్సు రాజు, వెన్నమల రమేష్, ఎలకంటి బిక్షపతి, పరావస్తు రఘుబాబు, ఆకుల రామకృష్ణ, వంగపల్లి శ్రీను, జానపట్ల సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మెట్టుగుట్ట మహాశివరాత్రి గోడ పత్రిక ఆవిష్కరణ

**వేద న్యూస్, కాజీపేట :**

ఓరుగల్లు మహా నగరంలో అతి ప్రాచీనమై, దక్షిణ కాశీగా పిలవబడుతున్న శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానములలో ఈ నెల 24 నుండి వచ్చే నెల 4వ తేది వరకు నిర్వహించబడు మహా శివరాత్రి ఉత్సవాల గోడ పత్రికలను సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ఆవిష్కరించారు. దేవాదాయ శాఖ, వరంగల్ జిల్లా సహాయ కమీషనర్ సునీత, కార్యనిర్వహణాధికారి శేషు భారతి, శివాలయం చైర్మెన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష శర్మ, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి,రెవెన్యూ డివిజనల్ అధికారి, హనుమకొండ, దేవేందర్ రెడ్డి ఎసిపి హనుమకొండ, అధికారులు పాల్గొన్నారు.

## ఆరెలకు ఓబీసీ సాధనకు కృషి చేయండి

**మొదటి పేజీ తరువాయి**

శివాజీ విగ్రహాన్ని దామెరలో ఆవిష్కరించిన ఆరె సంఘం కమిటీ వారిని అభినందించారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ తమ హీరోగా ఛత్రపతి శివాజీని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. సినీ హీరోల కంటే కూడా శివాజీ మహరాజ్ నే తమ నాయకుడిగా పిల్లలు భావిస్తున్నారని చెప్పారు. శివాజీ పుట్టిన కులంలో జన్మించిన ఆరె కులస్తులు అదృష్టవంతులని వెల్లడించారు. అయితే, ఛత్రపతి శివాజీ మహరాజ్ ఒక్క ఆరె కులానికి చెందిన నాయకుడు మాత్రమే కాదని, అందరికీ ఆరాధ్యుడని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపెల్లి శివాజీ, ఆరె సంక్షేమ సంఘం ఉద్యమ కమిటీ చైర్మన్ సోమిడి అంజన్‌రావు, సంఘ ఉపాధ్యక్షుడు జెండా రాజేశ్, సాంబరావు, మండల గౌరవ అధ్యక్షుడు సంతాజీ సుకినె, జిల్లా నాయకులు సుకినె సుధాకర్ రావు, హింగె భాస్కర్, కిషన్ రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు కడం రాజు, వరికెల కృష్ణ, దామోదర్, ఇరువాల మల్లయ్య, రవీందర్, శ్రీనివాస్, మోరె బాబురావు, సోలెంకె శ్రవణ్ కుమార్, కరట్లపల్లి రమేశ్, నగేశ్, శ్రీనివాస్, రవీందర్, రాజు, అశోక్, నర్సింగం పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073